సాక్షి
కుమురం భీం
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



సమస్యల్లో ప్రభుత్వ పాఠశాల

లింగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సమస్యలు వెంటాడుతున్నాయి. కనీస వసతులు లేక విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. 9లో▸



నాగోబాకు పోటెత్తిన భక్తజనం

కేస్లాపూర్‌లో నాగోబా జాతర కొనసాగుతోంది. బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /20.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిషనర్ భుజంగరావు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా భుజంగరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లి ఆర్వోగా పనిచేస్తున్న భుజంగరావు ఆసిఫాబాద్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఈవో వంశీకృష్ణ, సిబ్బంది సంతోష్, నాగేందర్, వంశీ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఫిబ్రవరి 1న నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీకి తాత్కాలికంగా కమిషనర్‌గా కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజన్న అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి కమిషనర్‌గా రావడంతో ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలు, అధికారుల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని భుజంగరావు తెలిపారు.

జెడ్పీ సీఈవోగా అనిల్



జెడ్పీ చైర్మన్ కృష్ణారావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఈవో అనిల్

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నికల బదిలీల్లో భాగంగా జెడ్పీ సీఈవోగా అనిల్ బదిలీపై జిల్లాకు వచ్చారు. బుధవారం ఆయన జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావును కాగజ్‌నగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ తోటాజీ తదితరులు ఉన్నారు.

జాతరకు ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో గల బాలేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఈ నెల 16న నిర్వహించే జాతరకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు ఆదేశించారు. బుధవారం సిబ్బందితో కలిసి జాతర పరిసర ప్రాంతాలను సందర్శించారు. పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ పనులు వేగవంతం చేయాలన్నారు. సిబ్బంది ప్రశాంత్, ప్రణయ్, ఉదయ్, సంతోష్, సందీప్ తదితరులు ఉన్నారు.



అటవీశాఖ కార్యాలయం నిర్మాణ పనులు అడ్డుకుంటున్న గ్రామస్తులు(ఫైల్)

కదలని జాయింట్ సర్వే!

- గ్రామస్తులు, అటవీ శాఖ మధ్య భూవివాదం
- హద్దులు గుర్తించకపోవడంతో తరచూ ఇబ్బందులు
- ఉమ్మడి సర్వేతోనే సమస్యకు పరిష్కారం
- దృష్టి సారించని అధికార యంత్రాంగం

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి, ఎల్లూర్ గ్రామ శివారుల్లో ఉన్న వందల ఎకరాల భూములకు సంబంధించి అధికారులు, గ్రామస్తులకు మధ్య వివాదం నెలకొంది. ప్రభుత్వ, అటవీశాఖ భూముల్లో నిర్మాణ, సాగు పనులు జరుగుతున్న క్రమంలో ఘర్షణ వాతావరణం చెలరేగుతోంది. ఇరుశాఖల మధ్య జాయింట్ సర్వే నిర్వహించి హద్దులను గుర్తించాల్సి ఉండగా.. ఇరుశాఖల తీరుతో ఏళ్లుగా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అటవీశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్తులు భూములు మావే అంటూ వాదిస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఇదీ పరిస్థితి..

రెవెన్యూ రికార్డుల ప్రకారం పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి శివారులోని సర్వే నం.61లో 1600 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉంది. ఈ సర్వే నంబరులో గ్రామంతోపాటు కొంతమంది రైతులకు ప్రభుత్వ పట్టాలు ఇవ్వగా పంటలు సాగు చేసుకుంటున్నారు. గ్రామానికి ఆనుకొని ఉన్న ఇదే సర్వే నంబరులో అటవీశాఖ అధికారులకు కడంబా మెయిన్ బ్లాక్ కంపార్టుమెంట్ నంబరు 155లో 1136 ఎకరాల భూములు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఎల్లూర్ శివారులోని సర్వే నంబరు 342లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 487 ఎకరాల అసైన్‌మెంట్ భూములు ఉండగా రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇదే సర్వే నంబరులో అటవీశాఖ అధికారులు తమకు కడంబా ఎక్స్‌టెన్షన్- 6, బెజ్జూర్ ఎక్స్‌టెన్షన్- 6, బెజ్జూర్ ఎక్స్‌టెన్షన్- 7లో 389 ఎకరాల అటవీశాఖ భూములు ఉన్నాయని అక్రమ నిర్మాణాలు, సాగు పనులను అడ్డకుంటున్నారు.

రెండేళ్లుగా వివాదం..

గత రెండు సంవత్సరాలుగా అటవీశాఖ, గ్రామస్తులు, రెవెన్యూ అధికారుల మధ్య వివాదం నెలకొంది. అటవీశాఖ భూముల్లో గ్రామస్తులు అక్రమ కట్టడాలు చేపడుతున్నారని పలుమార్లు అటవీశాఖ అధికారులు అడ్డుకుంటూ కేసులు నమోదు చేస్తున్నారు. ఎల్కపల్లి శివారులో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం నుంచి బెజ్జూర్ ప్రధాన రహదారిలోని బొక్కివాగు వరకు అటవీశాఖ భూముల్లో నిత్యం రైతులు, అధికారులకు మధ్య వాగ్వాదం జరుగుతూనే ఉంది. పలుమార్లు సమస్యను జిల్లాస్థాయి అధికారుల దష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదు. గత నెల రోజులుగా ఎల్కపల్లి శివారులో రోడ్డుకు ఆనుకుని అటవీశాఖ భూముల్లో నిర్మాణాలను చేపడుతున్నారని అటవీశాఖ అధికారులు కట్టడాలను అడ్డుకోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. అటవీశాఖ అధికారుల తీరుకు నిరసనగా మూడు రోజుల క్రితం హనుమాన్ విగ్రహం వెనుక రెవెన్యూ భూమిలో అటవీశాఖ అధికారులు క్వార్టర్ నిర్మాణ పనులను చేపడుతున్నారని గ్రామస్తులు అడ్డుకున్నారు. వివాదాస్పదంగా ఉన్న భూముల్లో సర్వే నిర్వహించిన తర్వాతే నిర్మాణాలను చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్వే చేస్తే మేలు..

ఎల్కపల్లి, ఎల్లూర్ శివారుల్లోని వందల ఎకరాల ప్రభుత్వ భూముల్లో సర్వే నిర్వహించాల్సి ఉండగా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వివాదాలు తలెత్తిన సమయంలో ఇరుశాఖల అధికారులు జాయింట్ సర్వే పేరుతో హడావుడి చేస్తున్నా సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. రెవెన్యూ భూముల్లో అటవీశాఖ అధికారులు పాగ వేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వందల ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ, అటవీశాఖ భూముల్లో జాయింట్ సర్వే నిర్వహించి భూముల హద్దులను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్వే నిర్వహించాలి



పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, క్రీడా స్థలాలకు ప్రభుత్వ భూమి గుర్తించాలి. వందల ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే జాయింట్ సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలి.

– దేవాజీ, బీఎస్పీ నాయకులు, పెంచికల్‌పేట్

అటవీ భూముల్లో ట్రెంచ్



ప్రభుత్వం నుంచి నూతన అటవీశాఖ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు కాగా మూడు రోజుల క్రితం గుత్తేదారు పనులు ప్రారంభించారు. అటవీశాఖ భూముల్లో నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలో గ్రామస్తులు పెద్దఎత్తున వచ్చి పనులను అడ్డుకున్నారు. సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. గతంలోనే అటవీశాఖ భూముల్లో ట్రెంచ్‌తో హద్దులను ఏర్పాటు చేశాం.

– జి.సుధాకర్, ఇన్‌చార్జి రేంజ్ అధికారి, పెంచికల్‌పేట్

ఆదేశాలు రాలేదు

పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి శివారులోని 61 సర్వే నంబరులో రెవెన్యూ రికార్డుల ప్రకారం 1,670 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఉన్నతాధికారుల నుంచి జాయింట్ సర్వే కోసం ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల తర్వాత ఉమ్మడి సర్వే నిర్వహిస్తాం.

– వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పెంచికల్‌పేట్

ఆశ్రమాలకు లోటు బడ్జెట్!

- జూన్ నుంచి బిల్లులు పెండింగ్
- భారంగా మారిన వసతి గృహాల నిర్వహణ
- మెనూ పాటించడం లేదని విద్యార్థుల ఆవేదన



సిర్పూర్(టి): లోటు బడ్జెట్‌తో ఆశ్రమ పాఠశాలల నిర్వహణ గాడి తప్పుతోంది. డైట్ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. దీంతో పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి డైట్ బిల్లుల చెల్లింపులకు ఇప్పటివరకు బడ్జెట్ కేటాయించలేదు. వసతి గృహాల నిర్వహణకు సంక్షేమాధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 46 ఆశ్రమాలు..

జిల్లాలో మొత్తం 46 ఆశ్రమ బాలుర, బాలికల పాఠశాలలు ఉన్నాయి. మరో నాలుగు పోస్ట్ మెట్రిక్ ఆశ్రమ విద్యాలయాలు కొనసాగుతున్నాయి. 2023- 24 విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్‌లో పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు బిల్లులు చెల్లించకుండా వసతిగృహాలు నిర్వహించలేమని వసతిగృహాల సంక్షేమాధికారులు తేల్చి చెప్పారు. పెండింగ్ బిల్లులు సైతం చెల్లించాలని విన్నవించారు. ఈ కారణంగానే జూన్ పూర్తయ్యే వరకు అసలు వసతి గృహాల్లోకి విద్యార్థులను అనుమతించలేదు. అప్పటి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వసతి గృహ సంక్షేమాధికారుల సమస్యలను గుర్తించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. విద్యార్థులకు భోజనం వండి పెడుతూ ఆశ్రమ పాఠశాలలు కొనసాగించాలని సూచించింది. దీంతో వివాదం సద్దుమణిగింది. అయితే అప్పుడు జూన్‌లో గత విద్యా సంవత్సరానికి సంబంధించి పెండింగ్ బిల్లులు మాత్రమే చెల్లించారని వార్డెన్లు వాపోతున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి కొన్ని ఆశ్రమాలకు జూన్ నుంచి.. మరికొన్నింటికి జూలై నుంచి బిల్లులు రాలేదని చెబుతున్నారు.

నిర్వహణ భారం..

ఒక్కో ఆశ్రమ పాఠశాలలో సుమారుగా 250 నుంచి 400 మంది విద్యార్థులు ఉంటున్నారు. ప్రతినెలా వసతి గృహ నిర్వాహణకు రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. సుమారుగా 7 నుంచి 8 నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వసతి గృహ నిర్వాహణ సంక్షేమాధికారులకు పెనుభారంగా మారుతోంది. ప్రభుత్వం అందిస్తున్న మెనూ పాటించడంతోపాటు వసతులు కల్పించాల్సి ఉంటుంది. బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అప్పులు చేసి వండి పెడుతున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపార సముదాయాల్లో అప్పు సైతం ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఆశ్రమాల్లో మెనూ ప్రకారం భోజన వసతి అందడం లేదు. నాణ్యమైన ఆహారం అందించడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

బిల్లులు పెండింగ్

జిల్లాలోని ఆశ్రమాల డైట్ బిల్లులు 2023- 24 విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్‌లో చెల్లించాం. జిల్లాలోని కొన్ని ఆశ్రమాలకు జూన్, జూలై వరకు చెల్లించాం. మరికొన్ని ఆశ్రమాలకు జూన్ నుంచి డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బడ్జెట్ రాగానే నిధులు కేటాయించి బిల్లులు చెల్లిస్తాం.

– రమాదేవి, డీటీడీవో

వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే


ఆసిఫాబాద్‌అర్బన్: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు అవసరమయ్యే అధికారులు, సిబ్బంది వివరాలను ఆయా శాఖల నుంచి సేకరించాలన్నారు. అర్హులైన వారి వివరాలను ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ ద్వారా పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని ఈ- డిస్ట్రిక్ మేనేజర్ గౌతమ్, ఎన్ఐసీ ఇన్‌చార్జి శ్రీకాంత్‌ను ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను సేకరించి నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు.

ఆసిఫాబాద్ డీఎస్పీ బదిలీ

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ డీఎస్పీ ఎం.వెంకటరమణ బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటరమణ స్థానంలో రామగుండం కమిషనరేట్ పరిధిలోని బెల్లంపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న పి.సదయ్యను ఆసిఫాబాద్ డీఎస్పీగా బదిలీ చేశారు. డీఎస్పీ వెంకటరమణను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మట్కా.. మాయ!

- జిల్లాలో జోరుగా నిషేధిత క్రీడ
- అత్యాశతో రోడ్డున పడుతున్న కుటుంబాలు
- నిత్యం రూ.లక్షల్లో లావాదేవీలు



ఆన్‌లైన్‌లో మట్కా గేమ్

మూడేళ్లలో నమోదైన మట్కా కేసులు		
2021	2022	2023
69	67	72

కౌటాల(సిర్పూర్): జిల్లాలో మట్కా దందాకు అడ్డుకట్ట పడటం లేదు. టెక్నాలజీ విస్తరిస్తుండంతో ఇంటర్నెట్ వేదికగా గుట్టుగా ఈ ఆట సాగుతోంది. తక్కువ సమయంలో సులభంగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశలో యువత పక్కదారి పడుతున్నారు. ఇటీవల కాగజ్‌నగర్ పట్టణంలో మట్కా ఆడుతున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు.

పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన యువత ఎక్కువగా మట్కాపై మోజు చూపుతున్నారు. ప్రతిరోజూ కాయాకష్టం చేసుకునే కూలీలు, కార్మికులు ఈ ఆటకు బానిసలై సంపాదించిన సొమ్మును పోగొట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతున్న మట్కా మహమ్మారికి అనేక కుటుంబాలు ఆధారం కోల్పోతున్నాయి. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన పలువురు యువకులు కాగజ్‌నగర్ పట్టణంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి.

అత్యాశతో ఆగం

రూపాయికి పది, పదికి వంద, వందకు వెయ్యి.. ఇలా ఎంత పెడితే అంతకు పదింతలు డబ్బు వస్తుందని ఆశ చూపుతూ మట్కా జిల్లాలోని కాగజ్‌నగర్, రెబ్బెన, వాంకిడి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం, కౌటాల మండలాల్లో ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. యువకులు, కూలీలు జూదంతో ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. రూ.5 నుంచి రూ.10ల వడ్డీకి అప్పు చేసి ఈ ఆట ఆడుతున్నారు. అప్పులు తీర్చలేక రోడ్డున పడుతున్నారు. మట్కా మాఫియాతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తెలంగాణలో ఈ క్రీడను ప్రభుత్వం నిషేధించింది. సమీప మహారాష్ట్రలో మట్కా దందాకు అనుమతి ఉండటంతో దాని ప్రభావం జిల్లాలోనూ పడుతోంది. మహారాష్ట్రలోని ముంబాయి, బల్లార్షా, వని, తదితర ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు వివిధ పేర్లతో మట్కా చీటీలను రాసే వారికి 20 నుంచి 40 శాతం వరకు కమీషన్ అందిస్తున్నట్లు సమాచారం. పండ్ల వ్యాపారులు, కూలీలు, ఆటో డ్రైవర్లు, సామాన్యులే లక్ష్యంగా ఏజెంట్లు డబ్బులు సేకరిస్తూ చీటీలు రాస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఆన్‌లైన్‌లో వచ్చే నంబర్లను ఫోన్ల ద్వారా ఏజెంట్లకు చేరవేస్తారు. ఏజెంట్లను నియమించుకుని ఒక వైపు ఆన్‌లైన్, మరోవైపు చీటీల రూపంలో డబ్బులు సేకరించి గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజులుగా కాగజ్‌నగర్ పట్టణంలో పోలీసులు తనిఖీలు చేపడుతుండటంతో మట్కా నిర్వాహకుడు, ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో ఆట

ఆన్‌లైన్ మట్కా ఆటకు కీలకంగా మారింది. గుట్టుచప్పుడు కాకుండా సెల్‌ఫోన్ల ద్వారా ఆడుతున్నారు. ఒకప్పుడు చిన్న కాగితంపై చెప్పిన నంబర్ రాసుకొని రిజిస్ట్రేషన్ చేసేవారు. ప్రస్తుతం టెక్నాలజీని వినియోగించుకొని సెల్‌ఫోన్‌ల ద్వారా మట్కా దందా సాగిస్తున్నారు. మట్కా ఆడుతున్న వారిలో తరుచూ ఒకరిద్దరూ పోలీసులకు పట్టుబడుతున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ప్రత్యేకంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని దందా విస్తరించుకుంటున్నారు. నిర్వాహకులు మొబైల్ ద్వారా ఆటగాడు చెప్పిన నంబరును రాసుకొని రిజిస్ట్రేషన్ చేస్తుంటారు. డబ్బులు తీసుకోవడం సైతం గూగుల్ పే, ఫోన్‌పే పద్ధతిని వినియోగిస్తున్నారు. జిల్లాలో ప్రతిరోజూ రూ.లక్షల్లో మట్కా వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. మట్కాతో అధికంగా సంపాదించ వచ్చనే అత్యాశతో ఈ ఆట బారినపడుతున్నారు. గత జనవరి 31 కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో మట్కా ఆడుతున్న ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణానికి చెందిన అర్జున్ వద్ద మట్కాకు సంబంధించిన చిట్టీలు, రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ నెల 13న కాగజ్‌నగర్ పట్టణంలో మట్కా ఆడుతున్న అబ్దుల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి మట్కా చిట్టీలు, రూ.4320 నగదు స్వాధీనం చేసుకున్నారు.

జూదం కట్టడికి చర్యలు



రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన మట్కా నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అత్యాశతో మట్కా ఆడితే కుటుంబాలు రోడ్డున పడతాయి. కాగజ్‌నగర్‌లో పలువురిని పట్టుకొని కేసులు నమోదు చేశాం. బృందాలను ఏర్పాటు చేసి జూదం కట్టడికి చర్యలు తీసుకుంటాం.

– కరుణాకర్, డీఎస్పీ, కాగజ్‌నగర్

జ్ఞానాన్ని ప్రసాదించు తల్లీ..

- భక్తులతో నిండిన బాసర
- అర్ధరాత్రి నుంచే క్యూలైన్లు
- చదువులతల్లి దర్శనం కోసం బారులు
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- ఘనంగా వసంతపంచమి వేడుకలు
- అసౌకర్యాలతో భక్తులకు అవస్థలు



అక్షరాభ్యాస పూజల్లో భక్తులు



ఆలయంలో క్యూ కట్టిన భక్తులు

భైంసా: 'శరదిందు సమాకారే పరబ్రహ్మ స్వరూపిణి! వాసరా పీఠనిలయే సరస్వతీ నమోస్తుతే!!'.. అని ఆ బాసర సరస్వతమ్మను కొలుస్తూ..'చదువుల తల్లీ చల్లంగా చూడమ్మా.. మా పిల్లలకు విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని ప్రసాదించు తల్లీ..' అంటూ రెండుచేతులెత్తి మొక్కారు. పవిత్ర గోదావరితీరంలో వ్యాసమహర్షి చేతుల్లో ప్రాణప్రతిష్ఠ పొందిన జ్ఞాన సరస్వతీమాత జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వసంతపంచమి పర్వదినం పురస్కరించుకుని బుధవారం బాసర భక్తజన సంద్రమైంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అశేషంగా తరలివచ్చిన భక్తజనవాహినితో చదువులమ్మ పులకించిపోయింది.

వేకువజాము నుంచే..

వసంతపంచమి పర్వదినాన తెల్లవారుజామున 2గంటల నుంచే జ్ఞానసరస్వతీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి అభిషేక సేవతో ఉత్సవం ప్రారంభమైంది. ఆలయ అర్చకులు, వేదపండితులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు మంగళవారం అర్ధరాత్రి నుంచే గోదావరిలో స్నానాలు ఆచరించారు. గోదావరి స్నానఘట్టాలు సైతం భక్తులతో నిండిపోయాయి. అక్కడి నుంచి ఆలయానికి చేరుకుని అమ్మవారి దర్శనానికి, చిన్నారుల అక్షరాభ్యాసానికి వేకువజామున 4గంటల నుంచే క్యూలైన్‌లలో నిల్చున్నారు. దర్శనానికి కనీసం 4గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం చండీ హోమం, వేద పారాయణ పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అభిషేక పూజలు భారీగా జరిగాయి.

అమ్మవారికి పట్టువస్త్రాలు..

తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన అభిషేక పూజలో స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పాల్గొన్నారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ తదితరులు కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఏటా దేవాదాయశాఖ మంత్రి హోదాలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేవారు. ఈసారి వసంత పంచమి వేడుకలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాలేకపోయారు.

భక్తులకు పలు సేవలు..

భక్తులకు ఆలయంతో పాటు స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో చిన్నారులకు పాలు, బిస్కెట్లు, అరటిపండ్లు, నీళ్లు అందజేశారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ పర్యవేక్షించారు. పోలీసు సిబ్బంది ప్రధాన ద్వారాల వద్ద బందోబస్తు చేశారు. బాసర రైల్వేస్టేషన్, బస్టాండ్, స్నానఘట్టాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వచ్చిన వాహనాలను పార్కింగ్ స్థలాల వైపు మళ్లించారు.

క్షేత్ర దర్శనం..

దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనంతో పాటు బాసరను చుట్టివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పడవలో ప్రయాణించారు. వ్యాసమహర్షి గుహ వద్ద దర్శనానికి భక్తులు వరుసలు కట్టారు. బస్టాండ్ వద్ద ఉన్న వేదవతి శిలను రాళ్లతో కొట్టి అందులో నుంచి వచ్చే స్వరాలను ఆస్వాదించారు. పలువురు భక్తులు పాదయాత్రగా బాసరకు చేరుకోవడం కనిపించింది. రోజంతా ఆలయంలో అమ్మవారిని స్మరిస్తూ భజనలు చేస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించారు. వసంతపంచమి సందర్భంగా బాసర ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ గర్భగుడిని పూలతో అందంగా అలంకరించారు. ప్రాంగణాన్ని విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. ప్రధాన ద్వారం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

ఉదయం నుంచి రాత్రి వరకు...

బాసర ఆలయంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల తాకిడి కనిపించింది. గతంతో పోలిస్తే ఈసారి భారీగా భక్తులు తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి రైలుమార్గంలో చేరుకున్నారు. నిజామాబాద్, భైంసారూట్‌లలో వచ్చే బస్సులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక వాహనాలను పోలీస్‌స్టేషన్ సమీపంలో, శాంకరీ ముందు స్థలంలో నిలిపివేశారు. వసంత పంచమి సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో వ్యాపారులకు చేతినిండా గిరాకీ దొరికింది. హోటళ్లు, టీకొట్లు, ఫలహారశాలలు భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి ప్రసాదాల కౌంటర్ వద్ద గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది.

క్రీడలతో మానసికోల్లాసం



పరిచయం చేసుకుంటున్న విశ్వప్రసాద్‌రావు

కాగజ్‌నగర్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని చింతగూడ గ్రామంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ అర్షద్ హుస్సేన్, నాయకులు జావేద్‌ఖాన్, ఉస్మాన్, తాజ్‌బాబా, మతీన్, ఫర్వేజ్, గైస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోతికి అంత్యక్రియలు



మృతిచెందిన కోతితో ఉదయ్‌సింగ్

భీమిని: మనుషులు, జంతువుల మధ్య ప్రేమ శతాబ్దాల నాటిది. ఇందుకు ఎన్నో ఉదాహరణలు మనం చూస్తునే ఉన్నాం. జంతువులు మనుషుల పట్ల చూపించే ప్రేమ, విశ్వాసం కొన్ని బంధాలకు ఉదాహరణగా నిలుస్తాయి కూడా. తాజాగా మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామంలో ఠాకూర్ ఉదయ్‌సింగ్ అనే వ్యక్తి ఓ కోతికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించి తన గొప్ప మనస్సును చాటి చెప్పాడు. 2000 సంవత్సరంలో ఠాకూర్ ఉదయ్‌సింగ్ ఇంటికి ఓ కోతి వచ్చింది. అప్పటి నుంచి ఆ కోతికి గుల్లు అనే పేరుతో నామకరణం చేసి ఎంతో అల్లారు ముద్దుగా తన కుటుంబ సభ్యుల్లో ఒకరిగా పెంచాడు. 24ఏళ్ల పాటు దానికి ఏ లోటూ రానివ్వకుండా చూసుకున్నాడు. ఇటీవల కోతికి పక్షవాతం రావడంతో అనారోగ్యానికి గురై చనిపోయింది. దీంతో దానిని పూలమాలలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి ఖననం చేశారు.

టేకు దుంగలు పట్టివేత



పట్టుబడిన టేకు దుంగలు

బెల్లంపల్లి: ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను బుధవారం బెల్లంపల్లి అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో సుభాష్ వివరాల ప్రకారం... కుమురంభీం ఆసిఫాబాద్ ప్రాంతం నుంచి ఓ కారులో ఎలాంటి అనుమతి లేకుండా టేకు దుంగలను బెల్లంపల్లికి తీసుకువస్తున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన అటవీ అధికారులు బెల్లంపల్లి చేరువలో మాటు వేసి కలప రవాణా చేస్తున్న కారును పట్టుకున్నారు. కారులోని ఏడు టేకు దుంగలు ఉన్నట్లు గుర్తించగా వీటి విలువ రూ.35 వేల వరకు ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు కారును, టేకు దుంగలను స్వాధీనం చేసుకుని అటవీ రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ఈ దాడిలో డెప్యూటీ ఎఫ్ఆర్‌ఓ గౌరి శంకర్, ఎఫ్ఎస్ఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతకు భరోసా..

- లైంగికదాడుల బాధితులకు అండగా కేంద్రం
- అన్యాయానికి గురైన బాలికలు, మహిళలకు సత్వర న్యాయం
- స్నేహపూర్వక వాతావరణంలో అవగాహన
- జిల్లాలో పెరుగుతున్న పోక్సో కేసులు

మంచిర్యాల జిల్లాలో 2023లో నమోదైన కేసులు..

అత్యాచారం	25
పోక్సో	16
వేధింపులు	234

2024 జనవరి, ఫిబ్రవరి 11 వరకు పోక్సో కేసులు 3, అత్యాచారం కేసు ఒకటి నమోదైంది.



సీసీసీ నస్పూర్‌లో ఏర్పాటైన భరోసా కేంద్ర భవనం

మంచిర్యాలక్రైం: ఆమె తల్లి.. మురిపాల చెల్లి.. జీవితానికి కల్పవల్లి. ఆకాశంలో సగమేకాదు. అవనికి ఆలంబన ఆమె. ఆ మహిళామూర్తి కొందరు ముష్కరుల కారణంగా అన్యాయానికి గురవుతోంది. పురుష అహంకారం ఆమెపై పంజా విసురుతోంది. కామంధులు మానవత్వం మరిచి పసిమొగ్గలను చిదిమేస్తున్నారు. ఇలాంటి ఆకృత్యాలను అరికడుతూ మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పోలీస్‌శాఖలో విమెన్ సేఫ్టీ వింగ్‌ను ఏర్పాటు చేసింది. దీనికి అనుబంధంగా ఇప్పటికే షీటీం పనిచేస్తోంది. బాలికల భద్రత కోసం మరో భరోసా కేంద్రాన్ని జిల్లా సమీపంలోని సీసీసీ నస్పూర్ పట్టణంలోని సింగరేణి క్వార్టర్‌లో ఏర్పాటు చేయగా ఈ నెల 6న డీజీపీ రవిగుప్తా వర్చ్యువల్ ద్వారా ప్రారంభించారు. వేధింపులకు గురైన చిన్న పిల్లలు, మహిళలకు భరోసా కేంద్రం అండగా నిల్వనుంది.

కేంద్రం నిర్వహణలో...

భరోసా కేంద్రం నిర్వహణ పూర్తిస్థాయి బాధ్యులుగా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, షీటీం ఎస్సై హైమా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కో–ఆర్డినేటర్‌గా, లీగల్ ఆఫీసర్, సపోర్ట్ పర్సన్, ఏఎన్ఎం, రిసెప్షనిస్టులుగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని భరోసా కేంద్రాన్ని పోలీస్‌శాఖలోని రాష్ట్ర విమెన్ సెఫ్టీ వింగ్ విభాగం కమిషనర్‌గా శిఖాగోయాల్ పర్యవేక్షణలో బాలికల, మహిళల రక్షణ కోసం భరోసా కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

బాలికలకు, మహిళలకు అండగా...

చిన్న పిల్లలు మొదలుకొని వయస్సుతో సంబంధం లేకుండా కులం, విద్యాస్థితి, వైవాహికస్థితి, జాతి, సంస్కృతితో సంబంధం లేకుండా శారీరక, లైంగిక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక వేధింపులను ఎదుర్కొంటున్న మహిళలకు మద్దతు ఇవ్వడంతో పాటు వారి సమస్యలకు భరోసా కేంద్రంలో పరిష్కారం లభించనుంది. భరోసా కేంద్రం ద్వారా పోలీస్, మెడికల్, లీగల్ ప్రాసిక్యూషన్ సర్వీసెస్‌తో పాటు సైకోథేరప్యూటిక్ కౌన్సెలింగ్ ద్వారా సమీకృత సాయం అందించేందుకు ఏర్పాట్లు సైతం చేస్తున్నారు.

మహిళల భద్రతే లక్ష్యంగా...

తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు ప్రత్యేక చొరువ తీసుకుంటుంది. ఇప్పటి వరకు మహిళల భద్రత కోసం షీ టీమ్, సఖీ సెంటర్, మహిళలు ప్రయాణం చేస్తున్నప్పుడు రక్షణ కోసం అబయ యాప్, హాక్–ఐ లాంటి యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. మరింత భద్రత కల్పించడమే లక్ష్యంగా భరోసా కేంద్రాలను ప్రారంభించింది. మహిళలపై జరిగే అఘాయిత్యాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు భరోసా కేంద్రం వైద్య, చట్టపరమైన, మానసిక కౌన్సెలింగ్ మద్దతిలో అత్యవసర, నాన్–ఎమర్జెన్సి యాక్సెస్ సేవలు సులభతరం చేయనుంది. బాధిత మహిళలతో స్నేహపూర్వకంగా వ్యవహరించేందుకు శిక్షణ పొందిన మహిళలను నియమిస్తున్నారు. అన్యాయం, అత్యాచారం, గృహహింసా, వేధింపులు, మోసానికి గురైనా బాలికలకు మానసికంగా ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు భరోసా కేంద్రాలు అండగా నిలువనున్నాయి.

బాధితులు ధైర్యంగా ఉండాలి



బాధితులు న్యాయం జరిగే వరకూ ధైర్యంగా ఉండాలి. పోలీస్‌స్టేషన్ నుంచి ఇక్కడికి బాధితులు వచ్చిన తర్వాత వారికి కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతోంది. బాలికలు ఎక్కడైనా వేధింపులకు గురైనా, అత్యాచారానికి గురైన నేరుగా భరోసా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేయాలి. బాలికల, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పోక్సో కేసుల్లో నేరుగా భరోసా కేంద్రంలో సంప్రదించాలి.– హైమా, ఎస్సై, షీటీం, భరోసా కేంద్రం ఇన్‌చార్జి, మంచిర్యాల

కలప స్మగ్లర్‌కు 14రోజుల రిమాండ్



నిందితుడితో అటవీ సిబ్బంది

జన్నారం: జన్నారం అటవి డివిజన్‌లోని తాళ్లపేట్ రేంజ్ తపాలపూర్, మహ్మదబాద్ బీట్‌లలో అక్రమంగా చెట్లు కొట్టి కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన నిందితుడికి లక్సెట్టిపేట్ న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు తాళ్లపేట్ రేంజ్ అధికారి సుష్మరావు తెలిపారు. బుధవారం ఎఫ్ఆర్‌వో వివరాలు వెల్లడించాడు. మల్యాల గ్రామానికి చెందిన ముడితే నర్సయ్య తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని తపాలపూర్‌లో గతంలో స్మగ్లింగ్‌కు పాల్పడగా కేసు నమోదైంది. మంగళవారం తెల్లవారు జామున మళ్లీ మహ్మదబాద్ బీట్‌లో కలప స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు సమాచారం రాగానే పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. న్యాయమూర్తి అతడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

డీవైఎస్ఓగా రాజ్‌వీర్

మంచిర్యాలక్రైం: జిల్లా యువజన క్రీడాల శాఖ అధికారిగా కే.రాజ్‌వీర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన శ్రీకాంత్‌రెడ్డి కరీంనగర్ డీవైఎస్ఓగా బదిలీపై వెళ్లారు.

ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్టాపన

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ విఠల్



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీబుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో గణపతి పూజ, ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చరణల నడుమ న్యారేపతో చేసిన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠింపచేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండె విఠల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంబంతో విఠల్‌కు ఘన స్వాగతం పలికారు. బుగ్గ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తాన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు స్వామి, రవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి, ధ్వజస్తంభం దాత సుంకరి రాజేశ్వరి రాజేష్ దంపతులు, ఆలయ ఈవో బాపురెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, జేపీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓసీపీలో కాంట్రాక్ట్ ఆపరేటర్‌కు గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు గనిలో బుధవారం తెల్లవారు జామున 4గంటల ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు డంపర్ ఆపరేటర్ మొగిలి శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఓబీ డంపర్‌ను అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా షిఫ్ట్ చేజింగ్ పాయింట్ వద్ద ఆగి ఉన్న మరో డంపర్‌ను వెనుకాల నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడి కాలు విరిగి తెగిపోయింది. సమీపంలోని తోటి ఓబీ కాంట్రాక్టు ఆపరేటర్లు వచ్చి డంపర్‌లో చిక్కుకున్న శ్రీకాంత్‌ను బయటకు తీసి మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఘటన స్థలాన్ని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, నాయకులు సందర్శించారు. బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని, మెరుగైన వైద్యం అందించాలని ఓబీ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను డిమాండ్ చేశారు. రాత్రి పూట ఆగి ఉన్న డంపర్‌కు వెనుకాల పార్కింగ్‌లైట్లు, రేడియం స్టిక్కర్లు లేవని, దీంతో ప్రమాదం జరిగిందని తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీ అవరణలో గురువారం చేపట్టనున్న ఓరియంట్ సిమెంట్ కంపెనీ సున్నపురాయి మైనింగ్ విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సున్నపురాయి రెండో గని ఏర్పాటుకు 588.26 హెక్టర్లు అనుమతుల కోసం టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. మైనింగ్‌కు సంబంధించి దేవాపూర్, గట్రావుపల్లి గ్రామాల శివారులోని భూమి అవసరం ఉంది. ప్రాజెక్టు వ్యయం 208.22కోట్లుగా అధికారులు ప్రకటించారు. కాగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు కంపెనీ ముందుకు వెళ్తుండగా స్థానిక ఆదివాసీలు మాత్రం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించలేదనే ఆగ్రహంతో ఉన్నారు. గట్రావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రత్యేకంగా చేపట్టాలని మా పరిధిలో భూములు ఎక్కువగా పోతున్నాయంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సభ నిర్వహణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా స్థానికంగా ఆదివాసీలు తమ నిరసన తెలిపేందుకు సిద్ధం అవుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న వాహనాలతో అధికారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని చింతలపల్లి గ్రామ శివారులో అక్రమంగా మహా రాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని మహా రాష్ట్రకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు దాడి చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సుమారు 66క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని చెన్నూర్‌లోని వ్యవసాయ మార్కెట్‌కు తరలించారు. అలాగే బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ రవిందర్ మాట్లాడారు. మండలంలో రేషన్ బియ్యాన్ని డంపు చేసినా అక్రమ రవాణా చేసినా చట్ట పరంగా కేసులు నమోదు చేయడమే కాకుండా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానంతో భర్తపై భార్య హత్యాహత్నం

బెల్లంపల్లి: భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో భార్య హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బెల్లంపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం... బెల్లంపల్లిబస్తీకి చెందిన భూరుగు శంకర్‌తో లతకు కొన్నాళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తలు ఒకరిపై ఒకరు అనుమానాలు పెంచుకున్నారు. ఈ విషయంలో ఇరువురు ఎప్పుడు ఇంట్లో గొడవ పడుతుండేవారు. మంగళవారం రాత్రి సైతం భార్య లత శంకర్‌తో గొడవపడింది. బుధవారం తెల్లవారుజామున సుమారు 2గంటల ప్రాంతంలో ఇంట్లో నిద్రిస్తున్న శంకర్‌పై లత గొడ్డలితో దాడిచేసింది. శంకర్ అరవడంతో లత పారిపోయింది. కుటుంబ సభ్యులు శంకర్‌ను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. శంకర్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. శంకర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

భార్యపై భర్త హత్యాయత్నం

కాసిపేట: మండలంలోని కోమటిచేనుకు చెందిన గెడం వసంతపై ఆమె భర్త వెంకటేష్ హత్యాయత్నం చేశాడు. ఎస్ఐ గంగారాం కథనం ప్రకారం.. వసంతకు 15ఏళ్ల క్రితం వెంకటేష్‌తో వివాహమైంది. నాలుగేళ్లుగా అతడికి దూరంగా ఉంటూ కోమటిచేనులోని తన తల్లి ఇంటి సమీపంలో ఉన్న రేకులషెడ్డులో నివసిస్తోంది. ఆమె నిద్రిస్తున్న సమయంలో బుధవారం వేకువజామున 3.30గంటల ప్రాంతంలో రేకులషెడ్డుపై వెంకటేష్ డీజిల్ పోసి నిప్పంటించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సైకిల్‌పోలో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సిబ్బంది

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైకిల్ పోలో క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయిలో నాలుగో స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయులు గఫార్ తెలిపారు. జనవరి 3నుంచి 5వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాయ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులు వరలక్ష్మి, అంజలి, రవళి తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను డీటీడీవో గంగరాం, పీడీ బండ జీవరత్నం, సిబ్బంది అభినందించారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

- యువకుడిని అంతమొందించిన వివాహిత
- శవాన్ని కాల్చి మాయం చేసేందుకు యత్నం
- 24గంటల్లో నిందితుల అరెస్ట్



మహేందర్ (ఫైల్)

మంచిర్యాలక్రైం/చెన్నూర్‌రూరల్: ఐదేళ్ల పాటు ఓ యువకుడు వివాహితతో సహజీవనం గడిపాడు. చివరకు సదరు వివాహిత చేతిలో దారుణంగా హత్యకు గురైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. చెన్నూర్ మండలం పొన్నారం గ్రామానికి చెందిన రామగిరి మహేందర్ (35)కు అదే గ్రామానికి చెందిన పద్మ(వివాహిత)తో ఐదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. నాలుగు నెలల క్రితం పద్మ భర్త శేఖర్‌ను, ఇద్దరు పిల్లలను వదిలేసి మహేందర్‌తో వెళ్లిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కొంతకాలం తర్వాత మహేందర్, పద్మ ఆచూకీ లభించడంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ మహేందర్‌తోనే ఉండేందుకు పద్మ అంగీకరించింది. నెలరోజుల క్రితం మహేందర్, పద్మల మధ్య గొడవ కావడంతో తల్లిగారి గ్రామమైన కమ్మరిపెల్లికి వెళ్లిపోయింది. ఈ నెల 13న పద్మ మహేందర్‌కు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరింది. దీంతో మహేందర్ తన స్నేహితులైన కదారి శేఖర్, జాలంపల్లి సాయిరాజ్‌తో కలిసి ఆ గ్రామానికి వెళ్లాడు. స్నేహితులను కొంతదూరంలోనే ఉంచి రాత్రి 12గంటలకు పద్మ ఇంట్లోకి వెళ్లాడు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

పథకం ప్రకారమే హత్య...

పథకం ప్రకారం మహేందర్‌ను ఇంటికి పిలిపించి హత్య చేయాలని పద్మ నిర్ణయించుకుంది. ఇంట్లోకి వెళ్లిన మహేందర్‌తో గొడవ మొదలు కావడంతో పద్మ, పద్మ భర్త శేఖర్, తండ్రి మొగిలి ఓదెలు, తల్లి సుగునక్క కర్రలతో దాడిచేసి హత్య చేశారు. ఆ తర్వాత అదే రాత్రి ఎడ్లబండిపై శవాన్ని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కాల్చివేశారు. ఈ విషయాన్ని శేఖర్, సాయిరాజ్‌ల ద్వారా తెలుసుకున్న మహేందర్ సోదరుడు రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం కమ్మరిపెల్లికి వెళ్లిన పోలీసులు పద్మ కుటుంబ సభ్యులను నిలదీయగా అసలు విషయం వెలుగుచూసింది.

24గంటల్లో హంతకులు అరెస్ట్..

మహేందర్ హత్య కేసును నమోదు చేసుకున్న చెన్నూర్ సీఐ రవీందర్, డీసీపీ రంగంలోకి దిగారు. అటవీ ప్రాంతంలో సగం కాలిపోయిన మహేందర్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు చెన్నూర్‌కు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు పాల్పడినవారిని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

విప్రో స్కాలర్‌షిప్‌కు డిగ్రీ విద్యార్థిని ఎంపిక



అఖిలకు స్కాలర్‌షిప్ పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విప్రో స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. బీఎస్సీ బీజెడ్‌సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని దడంగి అఖిల 2023–24 విద్యా సంవత్సరానికి విప్రో సంతూర్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రతీ విద్యాసంవత్సరం రూ.24 వేల చొప్పున మూడేళ్లపాటు స్కాలర్‌షిప్‌ను విప్రో సంస్థ అందజేస్తుంది. నెన్నెల మండలానికి చెందిన దడంగి రమేష్, లక్ష్మి దంపతుల నాలుగో సంతానం అఖిలది నిరుపేద కుటుంబం. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిలను ప్రిన్సిపాల్ అభినందించి ఎంపిక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకుడు తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చదువులమ్మ చెంత.. సమస్యల చింత



చదువులతల్లి సరస్వతి అమ్మవారు కొలువైన బాసరలో భక్తులను సమస్యలు వెంటాడాయి. ఉత్సవాల సందర్భంగా భక్తుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. బుధవారం వసంత పంచమి సందర్భంగా వేలాదిగా వచ్చిన భక్తులకు పాత సమస్యలే దర్శనమిచ్చాయి. భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని తెలిసినప్పటికీ అధికారులు మాత్రం తాత్కాలిక పనులపైనే దృష్టిసారించారు. భక్తులకు రూములు లేక చిన్న పిల్లలతో రోడ్డు పక్కనే పడుకున్నారు. మహిళలు టాయిలెట్స్ సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. పలువురు భక్తులు క్యూలైన్‌లో సొమ్మసిల్లి పడిపోయారు. రాత్రి రెండు గంటల నుంచి భక్తులు అక్షరాభ్యాసాల కోసం క్యూలైన్‌లో పడుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

